కరపత్రం విడుదల చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

విద్యా సదస్సును జయప్రదం చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 11: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 16న గజ్వేల్‌లో నిర్వహించే విద్యా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయం వద్ద కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో జరిగే విద్యా సదస్సులో సంక్షోభంలో సామాజిక విలువలు, విద్యారంగ సంక్షోభం కర్తవ్యాలు అనే అంశాలపై ప్రొఫెసర్ ఖాసీం, ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి వక్తలుగా ప్రసంగిస్తారని చెప్పారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, సీనియర్ నాయకులు రామచంద్రం, భూమి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, రాజులు, నాజర్ పటేల్, అశోక్‌కుమార్, గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్, భాస్కర్, కటకం రాజయ్య, ఆనందం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జిన్నారం, జూన్ 11: జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని పారిశ్రామికవాడ, కార్మిక సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య కోరారు. మంగళవారం ఖాజీపల్లి పారిశ్రామికవాడలో నిర్వహించిన జిన్నారం సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. బొల్లారం, బొంతపల్లిలో దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని అప్‌గ్రేడ్ చేయాలని, బొల్లారంలో వంద పడకల దవాఖానకు బొంతపల్లిలో 25 పడకల ఆసుపత్రిని నిర్మించాలన్నారు. బొల్లారం, బొంతపల్లి పారిశ్రామిక వాడల్లో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు జీడిమెట్ల, నర్సాపూర్, పటాన్‌చెరు నుంచి ఫైర్ ఇంజన్‌లు వచ్చేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందన్నారు. కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కేవలం ఫైర్ స్టేషన్ లేకపోవడం మూలంగా ప్రాణ, ఆస్తినష్టం భారీగా జరుగుతోందని, వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. బొల్లారం పారిశ్రామికవాడల్లో సీసీరోడ్లు వేయాలని, పరిశ్రమలకు మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు, భాస్కర్‌రెడ్డి, శేఖర్, హుస్సేన్, నరసింహగౌడ్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

న్యాల్‌కల్, జూన్ 11: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని మిర్జాపూర్(బి) వైద్యాధికారి నృపేన్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మండలంలోని ఖలీల్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పరిసరాల శుభ్రత, ఆరోగ్య, పోషక విలువలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలకు వ్యాధులు సోకితే వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బోరు బావుల్లోకి కొత్త నీరు వస్తుందని, వేడి చేసుకొని తాగాలని సూచించారు. వైద్య సిబ్బంది శ్యామల, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'బడిబాట'

- గ్రామాల్లో కనిపించని అవగాహన కార్యక్రమాలు
- ఫొటోలకే పరిమితమవుతున్నారని ఆరోపణలు
- ప్రచారంలో దూసుకుపోతున్న ప్రైవేట్ యాజమాన్యాలు

అందోల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

అందోల్, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమం మండలంలో తూతూమంత్రంగా సాగుతున్నది. వేసవి సెలవులు ముగిసి నేటి నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానుండగా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమం కేవలం ఫొటోలకే పరిమితమవుతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్ 6న మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులతో కలిసి అడపాదడపా బడిబాటలో పాల్గొన్నారు. ఆ మరుసటి రోజునుంచి ఎక్కడ కూడా బడిబాట కార్యక్రమాలు పెద్దగా కనిపించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడక్కడా కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగి వెళ్లినట్లు చెబుతున్నారు. సంబంధిత అధికారులు సైతం బడిబాట కార్యక్రమంపై పెద్దగా దృష్టి సారించినట్లు కనిపించడంలేదు.

వచ్చామా.. వెళ్లామా.. ఫొటో దిగామా!

పాఠశాలల సిబ్బంది వచ్చామా.., వెళ్లామా.., ఫొటో దిగామా? అన్నట్లు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్ బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని, ఎక్కడా సమస్యలు ఉండకూడదని ఆదేశించారు. అయితే ఎక్కడా వారి ఆదేశాలు పాటించినట్లు కనిపించడంలేదు. తూతూమంత్రంగా ఫొటోలకే పరిమితమవుతున్నట్లు తెలుస్తున్నది. ఓ వైపు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ సిబ్బందితో గ్రామాలను చుట్టేస్తూ ప్రచారంతో ఊదరగొడుతుంటే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది తీరు అందుకు పూర్తి విరుద్ధంగా కనబడుతుంది. దీంతో ప్రభుత్వం ఎంతో మంచి లక్ష్యంతో తీసుకువచ్చిన బడిబాట కార్యక్రమం అనుకున్న లక్ష్యం నెరవేరక పక్కదారి పడుతున్నది. విద్యాశాఖ అధికారులతోపాటు బడిబాటలో పాల్గొనే ఇతర శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తున్నది. సంబంధిత శాఖ జిల్లా అధికారులైనా ఈ విషయంపై దృష్టిసారిస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. బడిబాట నిర్వహణపై నమస్తే తెలంగాణ ప్రతినిధి ఎంఈవో కృష్ణను సంప్రదించగా బడిబాట కార్యక్రమం గ్రామాల్లో విజయవంతంగా కొనసాగుతున్నదని, పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

భద్రత కోసమే ఆటోలకు స్టిక్కర్లు

కోహీర్: ఆటోలకు స్టిక్కర్లు అతికిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కోహీర్, జూన్ 11: ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలో మై ఆటో ఇన్ సేఫ్ కార్యక్రమం ప్రారంభంలో భాగంగా ఆటోలకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాద సమయంలో ఆటోలకు ఉన్న స్టిక్కర్లను స్కాన్ చేయడం ద్వారా మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రవి, పోలీసులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

ఝరాసంగం, జూన్ 11: ఆటోల్లో ప్రయాణించే ప్రజలకు పూర్తి భద్రత, భరోసా కల్పించడమే పోలీసుల బాధ్యతని ఝరాసంగం ఎస్ఐ రాజేందర్ రెడ్డి అన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆ ఆటోకు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్ ఉందా, లేదా అని గమనించాలన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించినా, దురుసుగా మాట్లాడినా, మరేయితర సమస్యలు ఎదురైనా డ్రైవర్ సీట్ వెనకాల ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను ఫొటో తీసి పోలీస్‌స్టేషన్ లేదా షీటీంలకు పంపించాలన్నారు. వెంటనే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఝరాసంగం పోలీసులు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మూర్తుజాపూర్‌లో మిషన్ భగీరథ సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

న్యాల్‌కల్, జూన్ 11: మండల కేంద్రమైన న్యాల్‌కల్, చినిగేపల్లి, హుస్సేల్లి, మూర్తుజాపూర్, డప్పూర్, రాంతీర్థం, చాల్కి, మిర్జాపూర్(బి) తదితర గ్రామాల్లో మంగళవారం మిషన్ భగీరథ పథకంపై ఇంటింటి సర్వేను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ తీసుకున్నారా? ప్రతి రోజు తాగునీరు వస్తుందా? ఏమైనా సమస్యలున్నాయా? వంటి వివరాలు సేకరించి ఫొటోలతో ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్ సర్వే తీరును పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు

భవన ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

రామచంద్రాపురం, జూన్ 11: తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన మున్సిపాలిటీ భవనం ప్రారంభోత్సవానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మున్సిపల్ పాలకవర్గం సభ్యులు ఆహ్వానించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి మున్సిపాల్ పాలకవర్గం సభ్యులు మంత్రిని కలిసి తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం గురించి వివరించారు. ఈ నెల 20వ తేదీన ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేయడంతోపాటు గద్దర్ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని మంత్రికి వివరించారు. మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి, గద్దర్ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ముఖ్యఅతిథిగా రావాలని మంత్రిని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే, కౌన్సిలర్లు మంత్రిని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, బాబ్జీ, శ్రీశైలం, నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, కొమురయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంసీ ప్లాంట్‌కి క్లోజింగ్ ఆర్డర్

రామచంద్రాపురం, జూన్ 11: తెల్లాపూర్‌లోని రేడియల్ రోడ్డుకి ఆనుకొని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ పసుర ఆర్ఎంసీ ప్లాంట్‌ని క్లోజ్ చేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంస్థకు నోటీసులు జారీ చేశారు. ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పాటుతో దుమ్ము, దూళి కాలనీలోకి రావడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మైహోం అంకుర కాలనీ అధ్యక్షుడు శ్రీధర్, బీఆర్ఎస్ నాయకుడు బుచ్చిరెడ్డితో కలిసి కాలనీవాసులు ఆర్ఎంసీ ప్లాంట్ ఎదుట ఇటీవల నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఎంసీ ప్లాంట్ కారణంగా నివాసం ఉండలేకపోతున్నామని కాలనీవాసులు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ ఘటనలపై 'నమస్తే తెలంగాణ' వార్తా కథనాలను ప్రచురించింది. వీటికి స్పందించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఇచ్చిన క్లోజింగ్ ఆర్డర్‌లో నమస్తే తెలంగాణ పేపర్‌లో ఆర్ఎంసీ ప్లాంట్‌పై వార్తా కథనాలు వచ్చాయని పొందుపర్చారు. వెంటనే ఆర్ఎంసీ ప్లాంట్‌ని క్లోజ్ చేయాలని నోటీసులు జారీ చేయడంతోపాటు ప్లాంట్‌కి కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో మైహోం అంకుర కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలు అందజేత

హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో మారుతీరాథోడ్

న్యాల్‌కల్, జూన్ 11: పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మండల విద్యాధికారి మారుతీరాథోడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు.

వీరభద్రుడి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

వీరభద్ర స్వామిని దర్శించుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గుమ్మడిదల, జూన్ 11: జిల్లాలోని సుప్రసిద్ధ క్షేత్రమైన బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని వీరన్న గూడెంలోని బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆమెకు ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు అందజేశారు. వీరితోపాటు బీఆర్ఎస్ నాయకులు సద్ది విజయభాస్కర్ రెడ్డి, మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గణేశ్, చక్రపాణి ఉన్నారు.

పొదల్లో బాలుడి మృతదేహం లభ్యం

హత్యచేసి పారవేసినట్టుగా అనుమానం

పటాన్‌చెరు, జూన్ 11: ముత్తంగి రింగు రోడ్డు జంక్షన్ వద్ద దారుణం చోటుచేసుకుంది. దాదాపు 10 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలుడి మృతదేహం పొదల్లో లభ్యమైంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఆఫీసర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ముత్తంగి గ్రామ పరిధిలోని కాండిడాస్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద ఒక బాలుడి మృతదేహం పొదల్లో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముళ్ల పొదల మధ్య మెరూన్ రంగు టీషర్ట్, బ్లూ కలర్ జీన్ ప్యాంట్‌తో బాలుడి మృతదేహం కనిపించింది. దగ్గరలోనే ఒక టిఫిన్ బ్యాగ్, దుప్పటి కూడా లభించింది. బాలుడి వంటిపై గాయాలున్నాయి. సోమవారం రాత్రి సమయంలో ఎవరో రింగురోడ్డు పైనుంచి బాలుడి మృతదేహాన్ని ఒక దుప్పటిలో చుట్టి పారవేసినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. బాలుడిని గుర్తిస్తే 87126 56724, 87126 56725 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

అందోల్, జూన్ 11: రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు అధిక లాభాలు వస్తాయని ఏడీఏ అరుణ, ఏవో విజయరత్న అన్నారు. మంగళవారం డాకూర్ రైతువేదికలో విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు, కలుపు యాజమాన్యం, చీడపీడల నివారణపై ఆదిలాబాద్ శాస్త్రవేత్త ప్రశాంత్‌తో కలిసి రైతులకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగుచేయడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ విధానం ద్వారా మొక్క తక్కువ ఎత్తులో ఎదగడం, కలుపునివారణ ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగాయని చెప్పారు. రైతులు పంట పెరగడానికి రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులను వాడాలని, అందుకు సహకారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 11: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షురాలు చాందిబాయి చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకాధికారులు చొరవ చూపాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, రూ.20 లక్షల మండల నిధులు దుర్వినియోగమయ్యాయని పలువురు సభ్యులు సభ దృష్టికి తేవడంతోపాటు విచారణ జరపాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ చాందిబాయి చౌహాన్, జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

బొల్లారం, జూన్ 11: భవిష్యత్ తరాల కోసం ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డ్ వైఎస్సార్ కాలనీకి చెందిన పార్క్ స్థలంలో కమిషనర్ మంగతాయారుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను భవిష్యత్ తరాలకు అందించేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు ఉన్నారు.

పత్తి చేనులో మొసలి ప్రత్యక్షం



ఝరాసంగం, జూన్ 11: మొసళ్లను మనం సహజంగా సరస్సులు, నదుల్లో మాత్రమే చూస్తుంటాం. అప్పుడప్పుడూ భారీ వరదల సమయాల్లోనూ బయటపడుతుంటాయి. అలాంటి మొసలి పంటపొలాల్లో కనిపిస్తే ఎవ్వరైనా జంకాల్సిందే. మంగళవారం ఝరాసంగం మండల పరిధిలోని గుంతమర్పల్లికి చెందిన భార్గవ రెడ్డి పొలంలో పత్తి కట్టెను తొలిగిస్తుండగా ఒక్కసారిగా పత్తి కట్టెల దాపునుంచి దాదాపు 6 అడుగుల మొసలి బయటికి రావడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులకు తెలుపగా వారు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సంజీవరావు, డిప్యూటీ తహసీల్దార్ యాసీన్, ఆర్ఐ రామరావు, ఎస్ఐ రాజేందర్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు గ్రామానికి చేరుకొని మొసలిని పరిశీలించి వివరాలు సేకరించారు. మొసలిని చూసేందుకు గ్రామస్తులు పొలం వద్దకు తరలివచ్చారు.

రైతు నేస్తంతో మేలు

హుగ్గెల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోహీర్, జూన్ 11: వానకాలం పంటల సాగులో రైతులు పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించేందుకు రైతు నేస్తం ఎంతగానో ఉపయోగపడుతున్నదని డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి తెలిపారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు రైతు నేస్తంలో పాల్గొంటారన్నారు. వారు రైతుల సందేహాలను తీరుస్తారని చెప్పారు. వానకాలం పంటల సాగు వివరాలను సంబంధిత వ్యవసాయాధికారుల వద్ద నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవోలు ప్రవీణ, వావణ్య, వినోద్‌కుమార్, నవీన్‌కుమార్, ఏఈవోలు ప్రదీప్‌కుమార్, వీరేందర్, సంధ్య, రేణుక, శివప్రియ, సవిత, వేదవతి, సాయిలు, నాగరాణి, భూపేశ్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దాదిగూడెంలో వ్యక్తి అదృశ్యం

దాది మహేశ్

జిన్నారం, జూన్ 11: ఊట్ల పంచాయతీ దాదిగూడెం గ్రామానికి చెందిన దాది మహేశ్ (35) వారం రోజులుగా కనిపించడం లేదని అన్న దాది రాజు మంగళవారం తెలిపారు. నర్సాపూర్ మండలం నత్నాయపల్లి గ్రామంలో ఉండే అక్క దగ్గరికి వెళ్లి వారం క్రితం ఇంటికి వచ్చాడని, రెండు రోజుల తర్వాత కనిపించకుండాపోయాడని రాజు తెలిపారు. తెలిసిన వాళ్ల దగ్గర, బంధువుల దగ్గర ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేదని, తమ్ముడు అదృశ్యంపై జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 89780 24976 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

బడిగంటకు వేళాయె..

దిగ్వాల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్న ఉపాధ్యాయులు

కోహీర్, జూన్ 11: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలు బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కానున్నాయి. ఇందులోభాగంగా విద్యార్థులకు స్వాగతం పలికేందుకు మంగళవారం మామిడి తోరణాలు, పూలతో పాఠశాలలను అలంకరించారు. పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

అనుమతిలేని పాఠశాలల్లో చేర్పించొద్దు

పటాన్‌చెరు, జూన్ 11: అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నదని పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండల విద్యాధికారి పీపీ రాథోడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా కొన్ని పాఠశాలలను ప్రారంభించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా పాఠశాలల్లో పిల్లలను చేర్పరాదని తల్లిదండ్రులకు సూచించారు. రెన్యూవల్ లేకుండా పాఠశాలలను నడిపిస్తున్నారని తెలిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. కొన్ని పాఠశాలల్లో అధికంగా అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్నారని సమాచారం ఉందన్నారు. పలు పాఠశాలల్లో యూనిఫాం, సాక్స్, షూ, బుక్స్, నోట్ బుక్కులు అమ్ముతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో ఇతర వ్యాపారాలు చేయకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు ఉందా, లేదా? అనే విషయాలు తెలుసుకొని పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. గుర్తింపు లేని పాఠశాలలపై తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 11: ఆర్సీపురం డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కార్పొరేటర్ పుష్పానగేశ్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డిని ఆమె ప్రత్యేకంగా కలిసి డ్రైనేజీ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని రామచంద్రారెడ్డినగర్, కాకతీయనగర్, అశోక్‌నగర్, జ్యోతినగర్, శ్రీనివాస్‌నగర్, ఓల్డ్ ఆర్సీపురం, మల్లికార్జుననగర్, వినాయకనగర్‌లో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ.3.5కోట్లు నిధులు అవసరం ఉన్నాయని కార్పొరేటర్ వివరించారు. వెంటనే నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరడంతో స్పందించిన జలమండలి ఎండీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బడిబాటను విజయవంతం చేయాలి

రాయికోడ్, జూన్ 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించే బడిబాట కార్యాక్రమం ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుధవారం రాయికోడ్ మండల కేంద్రంలో నిర్వహించే కార్యాక్రమానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బడిబాట కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం అంజయ్యకు ఆదేశించారు. ఆయనవెంట మాజీ జడ్పీటీసీ అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, నల్లంపల్లి పీఏసీఎస్ చైర్మన్ నాగ్‌శెట్టిపాటిల్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్, జిల్లా ఆర్‌వీఎం అధికారి వెంకటేశం, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం అంజయ్య ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 11: ప్రభుత్వ ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లేదా 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు 2024 ఆగస్టు 1 నాటికి అవకాశం ఉన్నదని, 14 సంవత్సరాలు నిండిన వారు అర్హులని స్పష్టం చేశారు. ట్రైనీ వెరిఫికేషన్ కోసం ట్రైనీలు రిజిస్టర్ మొబైల్ నెంబరును మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు http://iti.telangana.gov.in సందర్శించి వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 11: జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రమోషన్ కోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బీఎడ్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత కలిగి ఉన్న ఎస్‌జీటీలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో చేపడుతున్న ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని కోరారు.

రెండో విడత 'దోస్త్'

సదాశివపేట, జూన్ 11: దోస్త్ రెండో విడత ప్రవేశాలు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తాడెపల్లి పతంజలి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ తెలుగు, ఇంగ్లిష్ మీడియం కోసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో అప్లై చేసి ప్రవేశం పొందవచ్చన్నారు. మిగతా వివరాలకు 77805 41502 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యూనిఫామ్స్ అందించాలి

మునిపల్లి, జూన్ 11: విద్యార్థులకు రెండు జతల బట్టలను సకాలంలో అందించాలని డీఆర్డీవో జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దచెల్మెడ గ్రామంలో బట్టలు కుడుతున్న తీరును పరిశీలించారు. ఐకేపీ ఏపీఎం భాగయ్య ఉన్నారు.

DOCUMENT LOST

I, DASARI SUGUNA, W/o. Dasari Janardhan, R/o. H.No. 6-4-188, Bholakpur, Gandhi Nagar, Secunderabad. I have Lost My Original Sale Deed Document bearing No. 37764/ 2019 in my house. If anybody found, please Contact:

9849599682 - JANARDHAN